

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 10 సంచిక : 4 పుష్పం : 9-10 05-11-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 10 ISSUE : 4

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI (HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETHRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401 - 31188

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-10-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రతీ మానవుడికి సుఖం కావాలి, శాంతి కావాలి. మానవుడు ఏ పని చేసినా సుఖంకోసమే చేస్తాడు. ఆ సుఖం ఎక్కడ ఉంది అంటే మన స్వరూపంలోనే ఉంది అని పెద్దలు చెపుతున్నారు. ఒక వ్యక్తి నూటికి నూరుపాళ్ళ శాంతిలో, సుఖంలో ఉన్నప్పుడు భగవంతుడు ఉన్నాడా, లేడా అనే తలంపు కూడా వాడికి రాదు. సుఖం అనేది, శాంతి అనేది ఈ శరీరానికి, మనస్సుకు అతీతంగా ఉంది. శరీరానికి అనారోగ్యం వస్తే బాధపడతాము, మనస్సులో అశాంతి వస్తే దానిగురించి క్షోభ పడతాము. మనం జీవితం పొడుగునా ఈ శరీరం శవం అయ్యేవరకు ఈ శరీరం గురించి గాని మనస్సు గురించి గాని ఆలోచించుకుంటూ ఉంటాం గాని వాటిని దాటి వెళ్ళలేకపోతున్నాము. సత్యవస్తువు మన హృదయంలోనే ఉంది కాని అది మన మనస్సుకు అందదు, మన మాటకు అందదు. మన మాటకు అందదు కాబట్టి, మన మనస్సుకు అందదు కాబట్టి అది లేదు అని అనుకోవటానికి వీలులేదు. మన మనస్సు మనకు కనబడటం లేదు కాని మనస్సు లేదు అని ఎవరు అనరు. మీ బుద్ధి మీకు కనబడటం లేదు కాని మీకు బుద్ధి లేదా అంటే ఎవరూ ఊరుకోరు. బుద్ధికి రూపం ఉందా? రూపంలేదు కాని మీకు బుద్ధి ఉన్నట్లు తెలుస్తోంది కదా. మీ బుద్ధి మీకు ఎలా తెలుస్తోందో అలాగ జ్ఞానికి తన హృదయంలో ఉన్న వస్తువు, ఆత్మ అంతస్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. భగవంతుడికి రూపం లేదని, ఆయనకు నామం లేదని భగవంతుడు లేడని అనుకోవద్దు. భగవంతుడు అందరి హృదయాలలో

**ఈ సంచికలో..... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

10-10-04 జిన్నూరు ........ 1
17-10-04 అత్తిలి ........ 11

ఉన్నాడు. ధనవంతుడని, పేదవాడని, అధికారం ఉందని, అధికారం లేదని అలాకాదు భగవంతుడు అందరి హృదయాలలో నివాసంగా ఉన్నాడు. అయితే మన మనస్సులో పవిత్రత లేదు అందువలన మనకు భగవదనుభవం కలగటం లేదు. వేదంలో ఏమని చెప్పారు అంటే సంతానం వలనగాని; ధనం వలన గాని, కీర్తివలన గాని, అధికారం వలనగాని ఆత్మజ్ఞానం కలుగదు. ఒక్క త్యాగి మాత్రమే జ్ఞాని అవ్వగలడుగాని త్యాగికానివాడు జ్ఞానికాలేడు. త్యాగం అంటే మనం కానిదానిని విడిచిపెట్టగలగాలి. మన అందరికీ ఈ దేహమే ఆత్మ, దేహమే సర్వస్వం అనే బుద్ధి ఉంది, ఆ బుద్ధిని విడిచిపెట్టటమే త్యాగం. ఏదోరోజున ప్రతీవాడికి మరణం వస్తుంది. మన దేహానికి మరణం రాకముందే మరణాన్ని మనం చంపేయాలి, వాడు మాత్రమే జ్ఞాని అవ్వగలడు. తెలియటం, తెలియకపోవటం అనేవి మనస్సుకు సంబంధించిన విషయాలు. వీటి అన్నింటికి అతీతమైనది జ్ఞానం. మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది, దాని తాలుక అనుభవమే జ్ఞానం. మనస్సుకు ఉండవలసినంత పవిత్రత, అర్హత, యోగ్యత లేకపోవటం వలన ఆవస్తువు మనకు అనుభవంలోనికి రావటంలేదు. నిష్కాముడికి మాత్రమే ఆత్మజ్ఞానం కలుగుతుంది అని గీతలో పరమాత్మ చెప్పాడు. ఏరకమైన కోరిక లేనివాడు మాత్రమే సంతృప్తిగా ఉండగలడు. కోరిక ఉన్నవాడికి ఎవడికీ సంతృప్తి ఉండదు. సత్కర్మ చేయమని భగవంతుడు చెప్పాడు. కర్మకు, జ్ఞానానికి సంబంధం ఏమిటి అని కొంతమంది అంటూఉంటారు. సత్కర్మ చేయటం వలన, కర్తృత్వం లేని కర్మ చేయటం వలన బుద్ధి శుద్ధిఅవుతుంది. వాడు ఏమతస్థుడు అయినా బుద్ధి శుద్ధిఅవ్వకుండా ఇంతవరకు ఎవరికీ జ్ఞానం కలుగలేదు. ఇది ఒక కులంతో గాని, ఒక మతంతోగాని, ఒక ప్రాంతంతో గాని సంబంధంలేని బోధ. నువ్వు సత్కర్మ చేస్తూఉండాలి, అసూయపనికి రాదు, అసహనం పనికిరాదు. నువ్వు ఓర్పుతో సత్కర్మ చేయగా చేయగా నీ బుద్ధి శుద్ధి అవుతుంది. మనకు కోరిక వలన ఏమీరాదు, నీకు ఏదైతే అర్హత ఉందో, ఏదైతే యోగ్యత ఉందో అదే నీకు వస్తుంది అని భగవంతుడు చెపుతున్నాడు. మోక్షం కావాలి అనే కోరికను కూడా వదులుకోమని భగవంతుడు చెప్పాడు, మోక్షానికి కూడా సన్యాసం ఇచ్చేయి అప్పుడు నీకు మోక్షం వస్తుంది అన్నాడు. ఎదురుచూడటం వలన ఏదో వచ్చేస్తుంది అని మనం అనుకొంటాం కాని ఎదురుచూడటం వలన ఏదీరాదు. మన బుద్ధి శుద్ధి అయితే మన ఇంద్రియాలకు ఏకాగ్రత వస్తే, మనస్సుకు ఏకాగ్రత వస్తే, ఈశ్వరానుగ్రహానికి మనం పాత్రులమయితే ఈశ్వరుడు మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు కాని మనం కోరుకోవటం వలన ఏమీ వచ్చేయదు. అన్ని సిద్ధులకంటే గొప్పసిద్ధి మోక్షసిద్ధి, మోక్షసిద్ధికంటే మించిన సిద్ధి లేదు. మోక్షసిద్ధి లేకుండా ఇతరసిద్ధులు నువ్వు సంపాదించినా అవి స్వప్నంతో సమానము. నీకు అర్హత ఉన్నప్పుడు, యోగ్యత ఉన్నప్పుడు నీకు కోరిక అక్కరలేదు, కోరిక లేకపోయినా అది వస్తుంది. దేనికీ నువ్వు గాబరా పడవద్దు, భయపడవద్దు. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ప్రారబ్దంలో ఏది ఉంటే అది వస్తూ ఉంటుంది.

ఆ దేహంతో నీకు తాదాప్యం లేనప్పుడు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు నీకు సంతోషం రాదు, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు నీకు దుఃఖంరాదు. సబ్జక్టును ఎప్పడూ విడిచి పెట్టకూడదు. బాహ్యకారణాల వలన మనకు ఏదైనా కలిసివచ్చింది అనుకోండి, అప్పడు మనకు సంతోషం వస్తూ ఉంటే లోపల స్వరూపానికి దూరమయిపోతాము. పరిస్థితులు బాగా ఉన్నాయి అని సంతోషం వచ్చినా, పరిస్థితులు బాగాలేవని దుఃఖం వచ్చినా రెండూ మనోదేహములకే. మనం ఎంతసేపు శరీరం, మైండ్, ఇంటలెక్టు ఈ మూడింటి పరిధిలోనే ఉంటున్నాము. ఈ మూడింటిని దాటితేనేగాని అమృతానుభవం కలుగదు. తెలివి మంచిదే కాని దానిని మనం సద్వినియోగం చేసుకోవాలి. మనకు భగవంతుడు ఏ అవకాశములు అయితే ఇచ్చాడో వాటిలో ఒక్కటి కూడా దుర్వినియోగం చేయకుండా అన్నీ సద్వినియోగం చేసుకోవాలి. రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక చక్కటి మాట చెప్పారు. మనకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి, ఆ కష్టం వచ్చింది అని కంగారుపడతాము అనుకోండి ఉన్న సుఖాలు అన్నీ కూడా పోతాయి అని చెప్పారు. ఒకరి ప్రారబ్దంతో ఇంకొకరు పోల్చుకోకూడదు. ఎవరి దేహానికి సంబంధించిన ప్రారబ్దం వారిదే. ఒక ప్రారబ్దంతో ఇంకొకరి ప్రారబ్దాన్ని పోల్చుకోవటం వలన దుఃఖం వస్తుంది. కొంతమంది చాలా కష్టపడితేకాని పదిరూపాయలు సంపాదించలేరు, కొంతమంది ఏమీ కష్టపడకుండానే డబ్బు సంపాదించేస్తారు. అదోరకమైన ప్రారబ్దం, ఇదోరకమైన ప్రారబ్దం. ప్రారబ్దాలు రకరకాలుగా ఉంటాయి. మన ప్రారబ్దం ఏదో మనం చూసుకోవాలి అంతేగాని ఇతరులతో పోల్చుకోవటం వలన మరల అజ్ఞానంలో కూరుకొనిపోతాము. మీ బిహేవియర్ ప్రోపర్‌గా ఉండాలి. అహంకారం అనేది పోగొట్టుకొనేది కాదు, దానిని పోగొట్టుకోవాలని మీరు ప్రయత్నం చేస్తూ ఉంటే ఒకోసారి బిగుసుకుపోతుంది, దానంతట అదే ఊడిపోవాలి. దైనందిన జీవితంలో మీ మాట, చేత, మీ ప్రవర్తన ఈశ్వరుని దయను పొందటానికి అనుగుణంగా ఉంటే అహంబుద్ధి దానంతట అదే జారిపోతుంది కాని దానిని మీరు బలవంతంగా ఊడగొట్టుకోలేరు. కొంతమంది లోపల ఒకటి పెట్టుకొంటారు, బయట ఒకటి మాట్లాడతారు. దానివలన వారు మనకు తీసుకొని వచ్చే నష్టం మాట వదిలేయండి, వారికి తెలియకుండానే దేహబుద్ధి పెరిగిపోతుంది, లోపల అపవిత్రత ఉంటే అది బయటకు పోదు, అలాగే స్టోర్ అయిపోతుంది. కొంతమంది ప్రతీ విషయానికి లౌకికంగా మాట్లాడతారు, పైగా అది ఏదో తెలివి అనివారు అనుకొంటారు, దానివలన దేహాభిమానం పెరిగిపోతుంది. అటువంటి మనుషులకు విచారణ చేస్తే మటుకు అహంకారం పోతుందా అని జ్ఞానేశ్వర్ మహరాజ్ అన్నారు. నీమాట శుద్ధిగా ఉంటే, నీ బుద్ధి శుద్ధిగా ఉంటే, నువ్వు సహృదయంతో పనిచేస్తూ ఉంటే, నువ్వు కపటివి కాకపోతే అహంకారం ఎక్కడ ఉంటుంది, దానంతట అదే రాలిపోతుంది అంటున్నారు జ్ఞానేశ్వర్. మనకు ఎక్కడయితే ఇష్టం ఉందో, ఎక్కడయితే ప్రీతి ఉందో అది మనం బలవంతంగా జ్ఞాపకం పెట్టుకోనక్కరలేదు, సహజంగానే జ్ఞాపకం వస్తుంది. మీ ఇంట్లోని వారు మీకు జ్ఞాపకం వస్తున్నారా అని నేను

అడిగితే దానికి అర్థం ఏమిటి? మన ఇంట్లో వస్తువులు ఉన్నాయి, మనుషులు ఉన్నారు. మన ఇంట్లో ఉన్న వస్తువుల మీద ఉన్నప్రేమ, మన ఇంట్లో ఉన్న వ్యక్తుల మీద ఉన్న ప్రేమ దేవుడి మీద ఉంటే దానిని భక్తి అంటారు. ఈ పుస్తకాన్ని, మంచి నీళ్ళ సీసాను నేను మర్చిపోను అది నాది అనుకొన్నప్పుడు, అలాగే భగవంతుడు నావాడు అనుకొన్నప్పుడు ఇంక మరుపు అనేది రాదు. కాని మనం భగవంతుడిని పరాయివాడు అనుకొంటున్నాము, ఇంట్లో మనుషులను సొంతం అనుకొంటున్నాము యదార్థం చెప్పాలంటే భగవంతుడు మనవాడు, మన ఇంట్లోని మనుషులు అంతా పరాయివారే. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నూతిలో ఒక వస్తువు పడిపోయింది అనుకోండి. మనం ఏమి చేస్తాము. నోరు మూసుకొని, ముక్కు మూసుకొని నూతిలోనికి దిగి ఆ వస్తువు ఎంత లోతులలో ఉందో అక్కడికి వెళితేనేగాని ఆ వస్తువు దొరకదు, నీ హృదయంలో ఉన్న భగవంతుడు కూడా అంతే అన్నారు. నువ్వు వాక్కును నిరోధించి, మనస్సును నిరోధించి, ప్రాణాన్ని నిరోధించి నీ హృదయంలో ఆయన ఎంత లోతులలో ఉన్నాడో అక్కడకు వెళితేనేగాని భగవదనుభవం నీకు కలుగదు. అప్పుడు గాని నీవు మరణంలో నుండి విడుదలపొందలేవు. నాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చెయ్యి, నీకు ఇష్టమైన గురువును ఆశ్రయించు, నువ్వు ఏదిచేసినా నువ్వు అసలు పుట్టలేదు అన్న సంగతి నీకు తెలిస్తేనేగాని నీకు మోక్షం రాదు అని చెప్పారు. వాడు ఎంత సాధన చేసినా నేను పుట్టాను అనే భావన వాడికి ఉంటే ఇంక మోక్షం లేదు అన్నారు. నేను పుట్టాను అనుకొన్నప్పుడు వాడు ఏదో రోజున చనిపోతాడు. ఏది పుట్టలేదు, ఆత్మ పుట్టలేదు. వాడు ఆత్మ అయి ఉన్నాడు. ఆత్మానుభవం వాడికి కలిగినప్పుడు వాడు పుట్టలేదు అన్న సంగతి వాడికి తెలుస్తుంది. అప్పుడు కదా మోక్షం వచ్చేది అంతవరకు మోక్షం లేదు అన్నారు. ఇప్పుడు మనందరం మోక్షంలోనే ఉన్నాము. మోక్షంలోనే ఉండి మోక్షంలో లేము అనుకొని మోక్షాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తున్నాము. ఇంతకంటే అజ్ఞానం, ఇంతకంటే అవిద్య మరొకటి లేదు, ఇది అంతా మనస్సు యొక్క గారిడీ. నీకు వివేకం లేదు అని చెప్పటానికి, నీకు జ్ఞానం లేదు అని చెప్పటానికి ఈ ఒక్కటే చాలు అని చెప్పారు.

దేవుడు మనవాడు అనే బుద్ధి ఎవరికైనా ఉందా? దేవుడు మనవాడు అనేబుద్ధి ఉంటే సాధన పేరు మీద బాధ అక్కరలేకుండానే ఆయన మనకు దొరుకుతాడు, మనకు సాధన చేస్తున్నట్లు తెలియదు సాధన జరిగిపోతూఉంటుంది. మీ ఆయనను ఎవరైనా తిట్టారు అనుకోండి మీకు చాలా కోపం వచ్చేస్తుంది, దేవుడిని తిడితే ఎవరూ పట్టించుకోరు. ఎందుచేతనంటే దేవుడు మీవాడుకాదు అనుకొంటున్నారు, మీ ఆయనను మీవాడు అనుకొంటున్నారు. అందుచేత దేవుడిని ఎన్ని తిట్టినా పట్టించుకోవటంలేదు. దీనిని బట్టి మీరు భగవంతుడికి ఎంతదూరంగా ఉన్నారో తెలుస్తోంది కదా. మనకు ఏదైనా ఒక విషయం తెలిస్తే తెలుసును అని చెప్పాలి, తెలియకపోతే తెలియదు అని చెప్పాలి. మనకు తెలియనప్పుడు

తెలుసును అని చెపితే మనం నష్టపోతాము, వాడు నష్టపోతాడు. మనం స్వార్థంతోటి, కోరిక తోటి ఏదైనాపనిచేస్తే దానికి ఫలం వస్తుంది. ఆ ఫలాన్ని మనం ఎంజాయ్ చేస్తాము, ఎంజాయ్ చేసినప్పుడు వాసన పడుతుంది. ఆ వాసనలోనుండి కోరిక వస్తుంది, ఆ కోరికను బట్టి పని చేస్తాము, ఆ పని వలన ఫలితం వస్తుంది. మరల ఆ ఫలితాన్ని ఎంజాయ్ చేస్తాము, దానివలన వాసన పడుతుంది. ఇది కర్మచక్రం. ఇందులోనుండి విడుదల పొందాలంటే ఒక దేవతాపురుషుడి అనుగ్రహం లేకుండా, గురువు యొక్క దయలేకుండా ఇందులోనుండి ఎవడూ బయటకు రాలేడు. ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు జపం చేసినప్పుడు, ధ్యానం చేసినప్పుడు, సత్పురుషుల మధ్యలో ఉన్నప్పుడు తాత్కాలికంగా నీకు కొంత శాంతిగా ఉండవచ్చు. కాని నీకు వాసనలు పూర్తిగా వేరుతోసహా నశించేవరకు శాశ్వతమైన సుఖం, శాంతి, ఆనందం నీకు రాదు. మన శరీరంలో ఏదైనా చెడు పదార్థం ఉంది అనుకోండి, మనకు పెయిన్‌కింద వచ్చేవరకు అది లోపల ఉన్నట్లు మనకు తెలియదు. అలాగే మనలోపల ఉన్న వాసనలు తలంపురూపంలో వస్తేనేగాని లోపల ఆవాసనలు ఉన్నట్లు మనకు తెలియదు. భక్తుల చరిత్రలు చదువుతూ ఉంటే వారు ఎక్కువగా కష్టాలు పడ్డట్లు కనిపిస్తాయి. భగవంతుడు ఏమిచేస్తాడు అంటే ఆయన ఎవడినైతే అనుగ్రహించాడో వాడిలోని వాసనలను కదిపి ఒకోటి తలంపులకింద పంపిస్తాడు. ఏమిటి భక్తిగా ఉంటున్నాము, ఇన్ని తలంపులు వచ్చేస్తున్నాయి ఏమిటి అని మనం అనుకొంటాము. వాసనలు ఉన్నట్లు మనకు తెలియజేసి, వాటిని తొలగించుకొనే శక్తిని మనకు ఇచ్చి, వాటిని తొలగింపజేస్తాడు, వాడు ఈశ్వరుడు. అదంతా ఈశ్వరుడు చేసే ప్రక్రియ, అయితే ఆయనపట్ల మనకు ఉన్న భక్తిలో కొరత ఉండకూడదు, ఆయనపట్ల మనకు సజీవమైన విశ్వాసం ఉండాలి. భగవాన్ మనకు మంచి మాటలు చెపుతున్నారు కాని మనకు వినాలి అనిపించటంలేదు, ఒకవేళ విన్నా దానిని మననం చేయాలి అనిపించటం లేదు, దానిని జీర్ణం చేసుకోవాలి అనిపించటం లేదు. దానికి కారణం ఆమాట మంచిదికాదు అనికాదు మన బుద్ధి మంచిదికాదు. మన బుద్ధిలో దోషం ఉంది కాబట్టి ఆమాటలు మంచివి అయినప్పటికి, జ్ఞానంతో కూడిన మాటలు అయినప్పటికి వాటిని మనబుద్ధి రిజెక్టు చేస్తోంది. ఆ మాటలలో పొరపాటులేదు, మన బుద్ధిలోనే దోషం ఉంది. మన బుద్ధి మంచిదికాదు అని మనం అనుకోము, దేవుడు తప్పు చేసాడేమో అని అనుకొంటాము. మన బుద్ధిని మనం బాగుచేసుకోవాలి కాని ఎవరోవచ్చి చేస్తారని కనిపెట్టుకొని ఉండకూడదు. మనం చేసే ప్రయత్నం మనం ప్రోపర్‌గా చేయాలి, అందులో డెడికేషన్ కనుక ఉంటే, డివోషన్ కనుక ఉంటే డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ వస్తుంది. మనం ఏదైనా ఒక పనిచేస్తే గొప్పలకోసం, ఆడంబరాలకోసం, ఊరేగింపులకోసం ఆపని చేయకూడదు, కేవలము భగవంతుడిని దృష్టిలో పెట్టుకొని ఆపని చేయాలి. ఎందుచేతనంటే ఒక్క ఈశ్వరుని దయ తప్పించి మనలను ఉద్ధరించేది ఈ సృష్టిలో ఏదీలేదు. కొద్దిసేపు ఏకాంతంగా ఉండి ధ్యానం చెయ్యి. ఏకాంతవాసం ఎందుకు అంటే పదిమందిలో

కూర్చొన్నప్పడు మన మనస్సులో ఏమి ఉందో మనకు తెలియదు. ఏకాంతంగా కూర్చొన్నప్పడు మన మనస్సులో ఏముందో మనకు తెలుస్తూ ఉంటుంది. నీ మనస్సులో ఏముందో నీకు తెలియకుండా నువ్వు వాటిని తొలగించుకోలేవు. మనస్సులో దోషాలు ఎక్కువగా ఉంటే ఇంద్రియాల ద్వారా మనస్సు బయటకు పోతుంది. వాసనలు ఎక్కువగా ఉంటే లోకవిచారణ, దేహవిచారణ. వాసనలు తగ్గుతున్నాయి అనుకోండి అప్పడు ఇంద్రియాలు ఆ జీవుడిని బయటకు ఆకర్షించటం మానేస్తాయి, అప్పడు ఆత్మవిచారణ ప్రారంభమవుతుంది. నువ్వు ఏదైతే ఆలోచిస్తున్నావో, ఏదైతే తలుస్తున్నావో అదే అవుతావు అని ఇంగ్లీషులో సామెత ఉంది. లోకవిచారణ చేసేవాడు లోకానికి దగ్గరవుతాడు, ఆత్మవిచారణ చేసేవాడు ఆత్మే అవుతాడు. నీకు ఎవడిమీద అయినా అసూయ ఉంది అనుకో వాడు పాడుఅవ్వడు నువ్వు పాడవుతావు. మన పూర్వీకులు మనలను ధ్యానం చెయ్యమని చెప్పినా, సత్కర్మ చేయమని చెప్పినా, నిష్కామ కర్మ చెయ్యమని చెప్పినా వాసనా క్షయానికే. ఎంతో కొంత మనం సత్కర్మ చేయము అనుకోండి మనలో ఉన్న అపవిత్రత తగ్గదు. నీలో ఉన్న అపవిత్రత తగ్గితేకాని లోపలఉన్న పరమపవిత్రమైన వస్తువు నీకు వ్యక్తంకాదు. రావణాసురుడు మారీచుడితో నువ్వు బంగారు లేడి వేషం వెయ్యి, అప్పడు సీతమ్మ ఆ లేడికావాలి అంటుంది, రాముడు నీకూడా పరుగెడతాడు. అప్పడు నేను సీతమ్మను లంకకు పట్టుకొనిపోతాను అని చెపుతాడు. రావణాసురుడితో మారీచుడు అంటాడు ఇప్పడు నీవు చాలా సుఖంగా ఉన్నావు, అపరిమితమైన ఐశ్వర్యం ఉంది. ఆ సీతమ్మ గొడవ నీకు ఎందుకు? నీవు పాడైపోతావు. రాముడు అంటే మానవుడు అనుకొంటున్నావు ఈ గొడవలు వద్దు అని చెపుతాడు. కాని రావణాసురుడు వినలేదు, నేను చెప్పినట్లు చెయ్యి అంటాడు. అప్పడు మారీచుడు అనుకొన్నాడు. ఇప్పడు నా చావు దగ్గరకు వచ్చేసింది. బంగారపు లేడి వేషం వేయనంటే వీడు చంపుతాడు, లేడి వేషం వేస్తే ఆయన చంపుతాడు. వీడి చేతిలో చనిపోయేబదులు దేవుడి చేతిలో చనిపోవటం మంచిది అనుకొంటాడు. చీకటికి వెలుతురు అంటే ఇష్టం ఉండదు, చెడ్డకి మంచి అంటే ఇష్టం ఉండదు, అజ్ఞానికి జ్ఞానం అంటే ఇష్టం ఉండదు అని బంగారు లేడి వేషం ధరించే ముందు మారీచుడు మనస్సులో అనుకొన్నాడట. మనిషి పరుగెడుతూ తన నీడను తాను పట్టుకోవాలి అనుకోవటం ఎటువంటిదో గుళ్ళు, గోపురాల చుట్టూ తిరుగుతూ దేవుడిని పట్టుకోవాలి అనుకోవటం అటువంటిది. పరుగెడుతూ నీడను ఎలా పట్టుకోగలడు. అప్పడు గురువు ఏమి చేస్తాడు అంటే వాడిచేతిని వాడి హృదయం మీద పెడతాడు అప్పడు, ఆ నీడమీద ఉన్న చెయ్యి ఆ నీడను పట్టుకొంటుంది. ఇప్పడు పట్టుకొన్నాను అంటాడు. బాహ్యంగా పరుగెడుతున్న నీ మనస్సును పట్టి లోపలకు తిప్పి చూపిస్తాడు, వాడు గురువు. నువ్వు ఇక్కడ పట్టుకోవలసింది అని నీ హృదయంవైపు చూపిస్తాడు. రూపాల్లో ఏమీలేదు, నామాల్లో ఏమీలేదు. నువ్వు రూపబుద్ధిని పెంచుకోవద్దు, నామబుద్ధిని పెంచుకోవద్దు. నువ్వు చనిపోయేవరకు రూపంచుట్టూ, నామం చుట్టూ తిరుగుతూ ఉంటే చివరకు నీకు జ్ఞానం రాదు. నువ్వు

ఏదైతే కాదో దానికోసం ఏడుస్తూ ఉంటే నీకు వస్తే గొప్పలు రావచ్చుగాని, జ్ఞానంమటుకు రాదు. రూప నామాల చుట్టూ తిరుగుతూ ఉంటే ఇంక లోపలకు ఎలా వెళతావు? లోపలకు వెళ్ళకపోతే నీకు ఆత్మముత్యం దొరకదు. నీకు రూపదృష్టి లేనప్పుడు, నామదృష్టి లేనప్పుడు మనస్సుకు లోచూపు కలుగుతుంది. మనం సద్బుద్ధితో, సహృదయంతో ఒక పని ప్రారంభిస్తే అది ప్రవాహంలాగ సాగిపోతుంది. ఒకవేళ ఆపని పూర్తి అవ్వకుండా నీ శరీరం చనిపోతే మిగతావారు ఆపని పూర్తిచేసేస్తారు. నీ శరీరానికి బలం ఎలా ఉందో, నీ సంకల్పానికి కూడా బలం ఉంది. మనం ఎక్కడో ఒక గదిలో కూర్చొని అందరూ బాగుపడాలి, అందరూ సుఖంగా ఉండాలి, అందరూ శాంతిగా ఉండాలి అని లోకం యొక్క క్షేమం మనం హృదయ పూర్వకంగా కోరుకొంటాము అనుకోండి. మన తలంపు యొక్క శక్తికూడా ఈ ప్రకృతిలో కలిసి మన తలంపు తాలుక వైబ్రేషన్స్ కూడా ఈ సృష్టి మీద పనిచేస్తాయి. అందుచేత మనం ఎప్పుడూ మంచిమాటలే మాట్లాడాలి, మంచి తలంపులే ఉండాలి. ఎదుటివారి క్షేమం కోరుకోవాలి. మనం హృదయపూర్వకంగా ఎదుటి వారి క్షేమం కోరతాము అనుకోండి మన భావనాబలాన్ని బట్టి వారికి నిజంగా క్షేమం వస్తుంది. నీకు లోచూపు వచ్చింది అనుకో, నీ శక్తిని, వివేకాన్ని ఉపయోగించి ఆత్మవస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావు అనుకో అప్పడు వ్యక్తులపట్ల, సంఘటనల పట్ల, బాహ్య వస్తుజాలం పట్ల నీ దృక్పథమే మారిపోతుంది. శత్రువు శత్రువుగా కనబడడు. దేహప్రారబ్ధంలో పెయిన్ వచ్చినా, ప్లెజర్ వచ్చినా ఆ పెయిన్‌ను తీసుకోవు, ఆ ప్లెజర్‌ను తీసుకోవు ఎందుచేతనంటే నీవు లోపలకు వెళ్ళిపోయావు. ఈ పెయిన్, ప్లెజర్ అనేవి పైపైన బుడగల వంటివి. అదిగో నురుగు, అదిగో బుడగ, అదిగో కెరటం అనుకొంటాము. సముద్రం ఆ కెరటాన్ని చూడదు, బుడగను చూడదు, నురుగును చూడదు. జ్ఞాని యొక్క పరిస్థితి అంతే. వాడికి శత్రువు లేడు, మిత్రుడు లేడు. అందుచేతనే నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు అనేవారు భగవాన్. నువ్వు ఏదిగా ఉన్నావో అదిగానే ఉన్నావు. కాని దానికి నేను ఎంతో దూరంగా ఉన్నాను, దానిని తెలుసుకోవటానికి నేను ఎంతో కష్టపడాలి, ప్రాణాయామం చేయాలి, దానిని పొందాలి అనుకొంటున్నావు అది నీ అజ్ఞానానికి గుర్తు. నువ్వు పొందాలి, పొందాలి అనుకొన్నప్పుడు కూడా నీవు అదే అయి ఉన్నావు, ఇంక నువ్వు దేనిని పొందుతావు అంటున్నారు భగవాన్. ఎప్పుడూ కూడా గురువు దగ్గర అద్వైతం పనికిరాదు. రమణమహర్షిని చూపించి ఈయనలో ఏముంది అని మొన్న ఎవరో అంటున్నారు. ఏమీలేదని చెప్పినవాడు, ఇక్కడకు వాడు ఎందుకు వచ్చినట్లు, రమణాశ్రమానికి ఎందుకు వెళుతున్నాడు వాడు. మనం భగవాన్‌కు ఒక నమస్కారం పెడితే ఈయనలో ఏమీలేదు అని చెప్పినవాడు వెయ్యి పెడుతున్నాడు. అదో రకమైన పిచ్చి. ఆంజనేయస్వామి రాముడితో చెపుతాడు నేను దేహం అనుకొన్నప్పుడు నేను నీకు దాసుడినే. నేను ఆత్మ అనుకొన్నప్పుడు నువ్వూ నేను ఒక్కటే. ఆ స్థితి వచ్చేవరకు గురుభక్తి విడిచిపెట్టకూడదు. ఒక్క గాఢనిద్రలో తప్పించి మిగతా టైము అంతా దేహం

గొడవలో, మనస్సు గొడవలో ఉంటున్నావు. మరిగాఢనిద్రలో ఈ దేహం, మనస్సు ఎక్కడకి వెళ్ళిపోయినాయి. ఏది లేదో దాని గురించే ఆలోచిస్తున్నావు, ఏదైతే ఉందో దాని స్మరణ వదిలేసావు, అది ఉంది అనేటువంటి జ్ఞాపకం కూడా పోగొట్టుకొన్నావు, ఆ స్మృతే నీకు పోయింది. గాఢనిద్రలో మనకు శరీరధ్యాస లేదు, మనస్సు ధ్యాస లేదు, తెలివితేటలకు సంబంధించిన ధ్యాసలేదు, ఏదీలేదు. అక్కడ మనం ఉన్నామా, లేదా అంటే ఉన్నాము, సుఖంగా ఉన్నాము పగలు ఆస్థితి మనకు వస్తే అంతా ఆనందమే, అంతా శాంతే. లోపల వస్తువు ఉంది, అది నీకు అనుభవంలో లేదు. అది నీకు అనుభవంలోనికి రాకుండా ఏ బలహీనతలు, ఏ అలవాట్లు అయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోమని శాస్త్రం చెపుతోంది. భగవాన్ ఏమంటున్నారు అంటే బలహీనతలు ఉన్నాయని, అలవాట్లు ఉన్నాయని నువ్వే అనుకొంటున్నావు అవి బాగా బలంగా ఉన్నాయని అనుకొంటున్నావు, అంత బలంగానే సాధన చేస్తున్నావు. లేనివి లేనట్లు గ్రహిస్తే, ఉన్నదేదో ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది, ఆ వివేకం సంపాదించుకో. లేనివి ఉన్నాయని చెప్పేవాడవు నువ్వే, దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేసేవాడవు నువ్వే. జ్ఞానిని అయిపోయాను, పొందవలసింది ఏదో పొందేసాను అని చెప్పేవాడవు నువ్వే. ఇటువంటి గొడవలు వద్దు. ఉన్నాయి ఉన్నాయి అనుకోవటం కూడా ఒక తలంపు అంతకంటే ఏమీలేదు. ఏదో తెలుసుకోవాలి అంటున్నావు కదా చైతన్యం అలా అనుకోదు ఎందుచేతనంటే అంతాతానే. అంతాతానే అయినప్పుడు తెలుసుకోవటం అంటూ ఏమీలేదు. ఏదో తెలుసుకోవాలి అని దేహం అనదు, ఎందుచేతనంటే అది జడం. ఏదో తెలుసుకోవాలి అని ప్రతీరోజు గోల చేసేవాడు ఒకడు ఉన్నాడు కదా వాడిని తీసి ఒక ప్రక్కన పెట్టు అంటున్నారు భగవాన్. సన్యాసం అంటే తెల్లబట్టలు తీసేసి ఎర్ర బట్టలు కట్టుకోవటం కాదు, దేహంతో తాదాత్మ్యం పొందే తలంపును విడిచిపెట్టటమే సన్యాసం. నీ ప్రవర్తన ప్రోపర్‌గా ఉంటే నేను అనే తలంపు దానంతట అదే ఊడిపోతుంది. ధ్యానం కూడా చేసేది కాదు, వచ్చేది. ఎక్కడో ధ్యానం మాట అటు ఉంచండి, నీ మాటలో ప్రేమ లేదు, ఎప్పుడైనా ఎవరితోనైనా దయగా మాట్లాడావా, ఎండలో నిలబడి బాధపడేవాడిని నీడకు రమ్మని ఎప్పుడైనా పిలిచావా ఇంకనీకు నేను ఎలా పోతుంది పిచ్చివాడా. నీ బిహేవియర్‌ను బట్టి అది పల్చబడి రాలిపోవాలిగాని బలవంతంగా వదిలించుకోవాలి అంటే వదిలించుకోలేవు సరికదా అది గట్టిపడుతుంది అన్నారు. కురుపు పెచ్చు దానంతట అదే రాలిపోవాలి కాని కంగారు పడి మనం ఆ పెచ్చును కెలికాము అనుకోండి, పెచ్చుపోదు సరికదా చీము పడుతుంది. ఇదీ అటువంటిదే. నీ బిహేవియర్‌ను బట్టి ఈదేహబుద్ధి నెమ్మదిగా సన్నగిల్లి నశించాలి కాని కంగారు పడితే అదిపోదు. ఈ దేహబుద్ధి నశిస్తేనేగాని నీకు ఆత్మబుద్ధి కలుగదు. రైట్ ఏక్షన్, రైట్ స్పీచ్, రైట్ బిహేవియర్, రైట్ తింకింగ్ వీటి వలన కూడా భగవంతుడిలో ఐక్యం అవ్వవచ్చు. ఒక పని బాగా నేర్పుగా చెయ్యటమే యోగం కాదు, ఆ పని నిన్ను బంధించకుండా చూసుకోవాలి, అది నిజమైన యోగం. ఒక డాక్టరు గారు బాగా ఆపరేషన్ చేసారు అనుకోండి. మీరు

చాలా గొప్పగా చేసారు అంటాము అనుకోండి, ఆమాట వలన ఆయనకు అహంకారం వస్తే అది యోగం కాదు. ఆపరేషన్ బాగా చేసారు అనకముందు వాడి మనస్సు ఎంత సమానంగా ఉందో, మీరు బాగా ఆపరేషన్ చేసారు అన్నతరువాత కూడా అంత నిర్వికారంగా ఉంటే, అదీ యోగం. అంటే నువ్వు చేస్తున్న పని నిన్ను భగవంతుడిలో ఐక్యం చేయాలి. మీరు గొప్పగా చేసారు అంటే దానిలో నుండి ప్లెజర్ తీసుకొంటాము అనుకోండి మీకు మీలోపల ఉన్న స్వరూపానికి సెపరేట్‌నెస్ పెరిగిపోతుంది. వేరుభావన పెరిగేకొలది మనస్సుకు బాహ్యవ్యాపారం పెరిగిపోతుంది. అక్కడ నుండి పద్మశ్రీ ఎవడిస్తాడా అని కనిపెట్టుకొని ఉంటాము. మనకు తెలిసిన వారు ఎవరైనా ఉంటే రికమండేషన్ చేయించుకుంటే పద్మశ్రీ వస్తే రావచ్చునుకాని భగవంతుడు మటుకు మోక్షం ఇవ్వడు. అందుచేత కర్మను కర్మలా కాకుండా, కర్మను యోగంగా చేస్తే నీకు భగవదనుభవం కలుగుతుంది. కర్మను యోగంగా చేసినప్పుడు బయటనుండి ఎవరో మనలను మెచ్చుకోవాలి, మనకి సన్మానాలు చేయాలి అనే తలంపు రాదు.

మనం దూడను తోలుకొని వెళ్ళాలంటే పచ్చగడ్డి చూపిస్తే అది మన కూడా వచ్చేస్తుంది, లేకపోతే వెనకాల కర్రపెట్టి కొడుతూ తోలుకొని వెళ్ళాలి. భగవంతుడి మీద ప్రీతి ఉన్నవారు చేసే సాధన ఎలా ఉంటుంది అంటే పచ్చగడ్డి చూపిస్తూ ఉంటే దూడ ఎంత తేలికగా మన కూడా వచ్చేస్తుందో అంత తేలికగా మనస్సు హృదయం వైపుకు ప్రయాణం చేస్తుంది. భగవంతుడి మీద ప్రీతి లేకుండా సాధన చేస్తాము అనుకోండి, బలవంతంగా దూడను కర్రతో కొట్టి తీసుకొని వెళ్ళటం వంటిది, వాటిని యాంత్రిక సాధనలు అంటారు, యాంత్రిక సాధనల వలన వస్తువు నీకు ఎలా ఎరుకలోనికి వస్తుంది. దేవుడు ఉన్నాడా అయితే మాకు చూపించండి అంటారు. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే దేవుడి వరకు వెళ్ళవద్దు. నీకు దుఃఖం ఉంది అంటున్నావు కదా ఆ దుఃఖాన్ని నా చేతిలోవేసి చూపించు అన్నారు. మన దుఃఖాన్ని గురువుకు చూపించలేము. అయితే దుఃఖం లేదు అనా? దుఃఖం ఉంది. లోపల ఉన్న వస్తువు మీద మీకు ప్రీతి ఉంటే, ప్రేమ ఉంటే స్వీట్‌గా, సాఫ్ట్‌గా జీవుడు లోపలకు జారిపోతాడు. జీవుడు ఎప్పుడైతే హృదయంలోనికి జారిపోయాడో వాడి జీవలక్షణాలు అన్నీ పోతాయి. మనం నేను నేను అంటున్నాము కదా. ఈ నేను ఎవడు అని ఏరోజుకారోజు ప్రశ్న వేసుకొంటూ ఉండండి. నీ ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టి ఏపనిచేస్తే నీవు నా దయకు పాత్రుడివి అవుతావో ఆ పని చెయ్యి అని డిక్టేట్ చేస్తూ భగవంతుడు చెపుతున్నాడు. ఆయన చెప్పిన కొన్ని మాటలు ఇప్పుడు మనకు నచ్చకపోవచ్చు, మనకు బుద్ధి వచ్చాక నచ్చుతుంది. మన హృదయంలో అంతర్యామిగా ఉన్న ఆయన మాటలను మనం వింటే, వాటియందు మనకు గౌరవం ఉంటే, వాటియందు మనకు ఇష్టం కలిగితే ఆయన ఏ హృదయంలో అయితే ఉన్నాడో అక్కడకు పెయిన్ లేకుండానే మనకు తెలియకుండానే చాలా స్పీడుగా జారుకొంటాము. ఇష్టంలేకపోతేనే కష్టం ఉంటుంది, ఇష్టంలో కష్టం ఉండదు. మీకు ఎప్పుడైతే

ఈశ్వరుడి పట్ల ఇష్టం కుదిరిందో మీకు తెలియకుండానే జీవుడు హృదయంలోనికి జారిపోయి అందులో ఐక్యమయిపోతాడు. ఏ తలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో అది తన మూలమైన హృదయంలోనికి వెళ్ళి కరిగిపోతేనేగాని నీకు భగవంతుడు స్వరూపంగా వ్యక్తంకాడు. ఎప్పుడైనా మీకు లాభం వస్తోంది అనుకోండి దానిని మీరు బ్యాలెన్స్ చేసుకోలేరు అనుకోండి, మీకు నష్టం వస్తోంది అనుకోండి దానిని బ్యాలెన్స్ చేసుకోలేరు అనుకోండి, మీకు కష్టం వస్తోంది అనుకోండి దానిని బ్యాలెన్స్ చేసుకోలేరు అనుకోండి అప్పుడు ఏమౌతుంది అంటే దేహగతమైననేను లోపలకు ఎంటర్ అవ్వదు, బాహ్యానికి వచ్చేస్తూ ఉంటుంది. గాఢ నిద్రలో మనకు ఏదైనా వెలితి ఉందా? దుఃఖం ఉందా? ఏమీలేదు. గాఢనిద్రలో మనం ఎక్కడ ఉన్నాము అంటే మూలతలంపు మూలంలో ఉన్నాము. జాగ్రదవస్థలోకూడా మూలతలంపు మూలంలోనికి వచ్చేసాము అనుకోండి ఎంత హేపీగా ఉంటామో, ఎంత శాంతిగా ఉంటామో ఆలోచించుకోండి. మనం ఏదైనా పనిచేస్తున్నాము అనుకోండి ఒకోసారి ఆ పని జరుగుతుంది, ఒకోసారి ఆ పని జరుగదు దానికి మీరు కంగారు పడవద్దు. పూర్వ జన్మలకీ, ఈ జన్మకీ సంబంధం ఉంటుంది. ఒకోసారి తక్కువ ప్రయత్నంతో ఎక్కువపని అయిపోతుంది, ఒకోసారి ఎక్కువ ప్రయత్నం చేసినా తక్కువ పని అవుతుంది. మనం లోకంలో చూస్తున్నాము కదా కొంతమంది ఏపనీ చేయరు, వారికి రోజులు సుఖంగా వెళ్ళి పోతాయి, అన్ని సుఖాలు అనుభవిస్తూ ఉంటారు, అదోరకమైన ప్రారబ్దం అంటే మనలను అలా ఉండమని కాదు. వారితో మీరు పోల్చుకోవద్దు. ఒక మనిషి ప్రారబ్ధంతో ఇంకోమనిషిని ఎప్పుడూ పోల్చుకోకూడదు, దాని వలన ప్రమాదంలో పడతాము, మన మనస్సు బాహ్యా ముఖానికి వచ్చేస్తుంది. మనస్సు దానిమూలంలోనికి వెళ్ళి అది కరిగిపోతే లోపలఉన్న వస్తువు బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అప్పుడు బ్రహ్మం తప్పించి ఇంకొకటి గోచరించదు ఎందుచేతనంటే అది అంతటా వ్యాపించి ఉంది. అంతటా వ్యాపించిన వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు, ఎక్కడికైనా వెళ్ళటానికి నీవు లేనిచోటు అంటూ ఉంటే కదా, అదే మోక్షస్థితి. అప్పుడు స్వతంత్ర్యమైన ఆనందం, శాంతి నీకు అందుతాయి. భగవాన్ ఒక ముతక సామెత చెప్పారు. ఒకడు ఏనుగు మీద తిరగటానికి అలవాటు పడ్డాడు అనుకోండి, వాడిని మీరు గాడిదమీద ఊరేగుతారా అంటే ఎలాగ ఉంటుంది, జ్ఞాని దగ్గరకు వచ్చి మీరు స్వర్గానికి వెళ్ళండి, వైకుంఠానికి వెళ్ళండి అని చెప్పే మాటలు అలా ఉంటాయి. అంతటా వాడే అయినప్పుడు ఇంకవాడికి స్వర్గం ఏమిటి? వైకుంఠం ఏమిటి? దేవుడు మంచివాడే, ఆయన స్వరూపం మీకు ఇవ్వాలని చూస్తున్నాడు. కాని మీ బుద్ధిలో ఉన్న దోషాల వలన ఆయన ఆకర్షణలో పడలేకపోతున్నారు, ఆ దోషాలను తగ్గించుకొనేకొలది దేవుడి యొక్క ఆకర్షణలో పడతావు.